క్లుప్తంగా

టీబీ రోగుల కోసం నెల్కో కంపెనీ వితరణ

- ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు రూ.33.60 లక్షలు అందజేత



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న నేషనల్ అల్యూమినియం కంపెనీ ప్రతినిధులు

మహారాణిపేట : నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెట్ ప్రతినిధులు రూ.33 లక్షల 60 వేలు ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్–జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కోసం అందించారు. ఈ నిధులను టీబీ రోగులను ఆదుకోవడం కోసం వినియోగించాల్సి ఉంది. శుక్రవారం ఈ చెక్కును జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు నేషనల్ అల్యూమినియం కంపెనీ జనరల్ మేనేజర్ ఎ.వి. సుబ్బారావు, ఉపేంద్ర మిశ్రా, మేనేజర్ వి.అనురాధ అందజేశారు. ఈ నిధులను సీఎస్ఆర్ కింద విడుదల చేశారు.

శాకంబరి అలంకరణలో ఉమాదేవి



శాకంబరి అలంకరణలో శ్రీ ఉమాదేవి

అల్లిపురం : శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమాదేవి అమ్మవారిని ఆలయ అర్చకుడు భార్గవ శర్మ కాయగూరలతో శాకంబరి అవతారంలో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. లలితా పారాయణ అనంతరం అమ్మవారిని విశేష హారతులతో ఆరాధించారు.

డెంగ్యూ బాధితురాలికి డీఎంహెచ్‌వో పరామర్శ



పంజా జంక్షన్‌లో ఒక ఇంట్లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పంజా జంక్షన్ బురుజుపేట సచివాలయ పరిధిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ నమోదైన డెంగ్యూ బాధితురాలు అనూష (40)తో మాట్లాడారు. డెంగ్యూ వ్యాధి ఎప్పుడు, ఎలా సోకిందని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని పరామర్శించారు. అక్కడి హెల్త్ సెక్రటరీ, ఆశ కార్యకర్త, మలేరియా, శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా అక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆక్టివ్ సర్వేలెన్స్ ఆఫ్ మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వాక్సిన్ల జాబితాను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అదే ప్రాంతంలో దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం : ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో) దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగష్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో కిరండూల్ నుంచి బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది.

వ్యాధుల కాలం.. భద్రత ముఖ్యం

- విజృంభిస్తున్న రుగ్మతలు
- దోమల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి
- స్వీయరక్షణే శ్రీరామరక్ష

వర్షాకాలం అంటే చల్లగా హాయిగా ఉంటుందని భావిస్తాం. కానీ ఇది వ్యాధులు ముసురుకునే కాలం. అంతే కాదు వైరస్‌లు, బాక్టీరియా, ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీంతో జలుబు, దగ్గు, గొంతులో కఫం, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన పడతాం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.



కొబ్బరితోట యూపీహెచ్‌సీలో చిన్నారికి రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ సిబ్బంది

అల్లిపురం : వర్షాకాలంలో వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. జాగ్రత్తలు పాటించకపోతే పరిస్థితి తీవ్రంగా మారుతుంది. వర్షాకాలం అంటేనే సీజనల్ వ్యాధుల కాలం. వేసవి తర్వాత వాతావరణలో జరిగే మార్పులు, ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, వాటి వలన నిల్వ ఉండే వర్షపు నీటిలో దోమలు ఆవాసాలు ఏర్పరచుకోవడం, రోడ్లపైన, ఇంటి ఆవరణలో ఉన్న పాత టైర్లు, కొబ్బరిబొండాలు, ఇతర పాత వస్తువుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమల లార్వాలు వృద్ధి చెందటం వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నారులు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

వ్యాధులు ముసిరే కాలం..

వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా పెరుగుతాయి. దీంతో వైరల్ ఫీవర్, ఇన్ఫెక్షన్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. ఈ సమయంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు గాలి ద్వారా వ్యాపించే జలుబు, గొంతునొప్పి వంటివి వస్తాయి. ఈ కాలంలో చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు అందరూ ఆయా వ్యాధుల బారిన పడుతుంటారు.

డెంగ్యూ లక్షణాలు..

- ఆకస్మికంగా అధిక జ్వరం (105 డిగ్రీలు)
- తీవ్రమైన తలనొప్పి, కళ్లు, కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు, అతిసారం
- చర్మంపై దద్దుర్లు (జ్వరం వచ్చిన 2–5 రోజుల తర్వాత)
- చిగుళ్లు, ముక్కు నుంచి చిన్నపాటి రక్తస్రావం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షాకాలంలో బాక్టీరియా, వైరస్ మనుషుల మీద ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఎప్పుడూ కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది. గోరువెచ్చని నీరు తాగాలి.
- ఫిల్టర్ వాటర్, ప్యూరిఫైయర్ నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. బయటికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్ల బాటిల్ తీసుకెళ్లడం మంచిది. రోడ్డు పక్కన లేదా ఎక్కడ పడితే అక్కడ ఉన్న నీటిని తాగకూడదు.
- వీలైనంత వరకు స్ట్రీట్ ఫుడ్ తినడం మానుకోవాలి. పానీపూరీ, మసాలా పూరీ, పావ్‌బాజీ వంటి బయటి ఆహారం తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.
- ఏదైనా తినడానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. ఈ చిన్న అలవాటు మిమ్మల్ని ప్రమాదకర బాక్టీరియా, వైరస్ నుంచి కాపాడుతుంది.
- పండ్లు, కాయగూరలను మంచినీటితో శుభ్రంగా కడగడం మర్చిపోకూడదు.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడటం మంచిది. నిద్రపోయేటప్పుడు ఫుల్ స్లీవ్స్ ధరించాలి.
- పోషకాహారం తినడం మంచిది. విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉండే ఆహారం ఎక్కువగా తినాలి. ఇవి వ్యాధులు రాకుండా నివారిస్తాయి.
- ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే తొలగించాలి.

విశ్రాంతి, ప్రాథమిక చికిత్స..

డెంగ్యూ, విషజ్వరాల చికిత్సకు నిర్దిష్టమైన మందులు లేవు. డెంగ్యూ జ్వరం ఉన్నప్పుడు ఎక్కువ విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవాలి. మూత్ర విసర్జన తగ్గడం, నోరు, పెదవులు పొడిబారడం, నీరసం, గందరగోళం, జలుబు, చేతులు, కాళ్లు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటే తక్షణం వైద్యుడిని సంప్రదించి ఆయన సూచన మేరకు మందులు వాడాలి.



33వ వార్డులో దోమల లార్వాల కోసం మంచి నీటి కుండీలను పరిశీలిస్తున్న మలేరియా సిబ్బంది

అవగాహనతో వ్యాధులు దూరం..



వాతావరణంలో మార్పుల వల్ల విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దీనిపై ఆశ వర్కర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని సూచిస్తున్నాం. ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. జాగ్రత్తలు పాటిస్తే ఈ వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు.

– డాక్టర్ జయంత్, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ, కొబ్బరితోట

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం



రాట కార్యక్రమం నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు, మహిళలు

డాబాగార్డెన్స్ : దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 ఏళ్ల వార్షికోత్సవ వినాయక చవితి మహోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మహారాణిపేట దిబ్బలపాలెం రామాలయం సమీపాన అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక మహిళలు పందిరి రాటకు పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వినాయక మండప నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా వినూత్న రీతిన వినాయక ప్రతిమలు ఏర్పాటు చేస్తూ వస్తున్నామన్నారు. పర్యావరణానికి హానీ తలపెట్టకుండా 25 ఏళ్ల మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేస్తూ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా మట్టి గణపతినే వినూత్నంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చిటికిరెడ్డి పవన్‌కుమార్, త్రినాథరావు, ఉరుకూటి గిరీష్, చందక ప్రవీణ్, పి. శ్రీనివాసరాజు(రాజేష్), మన్మథ, తాడి శ్రీధర్, బండారు లోకేష్‌కుమార్, కట్టా యశ్వంత్, తేజ, గ్రెడ్డి వరుణ్‌కుమార్, చందక ప్రభాకర్, పడాల సూర్యకుమార్, పసగాడ రామలింగేశ్వరరావు, కసినిబోయిన చంద్రశేఖర్, ప్రసాద్, అజయ్, మణి, కిషోర్, హరి, రమేష్ పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కుక్కల బెడద

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో కుక్కల బెడదతో వినియోగదారులు హడలిపోతున్నారు. ఈ బజారు నిత్యం వినియోగదారులు, రైతులు, సిబ్బందితో రద్దీగా ఉంటుంది. ఇక్కడ కొన్ని కుక్కలు తిష్ట వేయడంతో వినియోగదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒక కుక్క తరచూ దాడులకు పాల్పడుతుండటంతో వినియోగదారులు రైతుబజారుకు రావడం మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని వినియోగదారులు, రైతుబజార్ సిబ్బంది కోరుతున్నారు.

అవగాహనతో సీజనల్ వ్యాధులకు చెక్



కొబ్బరితోటలో ఇంటింటికీ వెళ్లి దోమ లార్వాలను గుర్తిస్తున్న ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలో కేఎస్‌వీ కుమార్ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మూడు చెత్త బుట్టల విధానం అమలు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి మంచినీటి తొట్టెల్లో దోమ లార్వాలను గుర్తించి వాటిని పారబోశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జి.సత్యనారాయణ, జీవీఎంసీ ఎంపీహెచ్ఏ రమేష్‌కుమార్, ఏఎన్ఎం ఒ.సత్యవతి, ఆశ వర్కర్ వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణ, అవగాహనపై నేరెళ్ల కోనేరు, వినాయక గుడి వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వర్షాకాలంలో దోమలు నిల్వ ఉండే పాతటైర్లు, వాడేసిన కొబ్బరిబొండాలు, పాత సామగ్రిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీరావు, మలేరియా ఇన్‌చార్జి రమేష్, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా సిబ్బంది

దొండపర్తిలో..

సీతమ్మధార : దొండపర్తిలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 27వ వార్డు కార్పొరేటర్ బుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణకు ఇంటి పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.



దొండపర్తిలో ఫ్రైడే–డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కంచరపాలెంలో..

కంచరపాలెం : వర్షాకాల వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ బాబు తెలిపారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీ, మాన్యువల్ స్ట్రీట్, స్లీపర్స్ వీధి, రాచవీధి, పార్క్‌వీధి ప్రాంతాల్లో శుక్రవారం సచివాలయ శానిటరీ కార్యదర్శులతో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్ అర్జునుడు, వార్డు శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంచరపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

ఆదివాసీలకు డిజైన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్



ఆదివాసీల హస్తకళలు తిలకిస్తున్న మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్ : లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీలకు సీతంపేట గ్రామంలో డిజైన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్, సవర ఆదివాసీలకు పెయింటింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. లేపాక్షి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత, ఎండీ బాలసుబ్రహ్మణ్యం, ఈడీ ఎం. విశ్వ, లేపాక్షి కార్యనిర్వహణాధికారి ఆసపు కార్తీక్ నేతృత్వంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్, పెయింటింగ్ శిక్షణ, ట్రైబల్ ఆర్ట్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం తిలకించారు. కళాకారుల ప్రతిభను గుర్తించిన కలెక్టర్ వారిని అభినందించారు. శిక్షణకు పూర్తి సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న ఆదివాసీ ట్రైబల్ ఆర్ట్‌కు పూర్వ వైభవం రాబోతుందన్నారు. అంతే కాక ఎంతో మంది ఆదివాసీలకు ఉపాధి కల్పించిన వారం అవుతామని, ప్రతి ఒక్కరూ ఆదివాసీలు రూపొందించిన వస్తువులు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ వీవీ రమణ, డిజైనర్లు ధర్మ, తేజస్వి, కిషోర్, స్థానిక కన్వీనర్ అనిల్‌కుమార్, ఆర్ట్ టీచర్ గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ పాటలు

ధ్వని అనుకరణతో ఆకట్టుకున్న డీటీఎస్ రమేష్



మైకేల్ జాక్సన్ పాటకు నోటితో సంగీతం అందిస్తున్న డీటీఎస్ రమేష్

మద్దిలపాలెం: ప్రసిద్ధ పాప్ కింగ్ మైకేల్ జాక్సన్ జయంతి వేడుకలను శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారుడు రమేష్ కుమార్ (డీటీఎస్ రమేష్) తన గాత్రంతో నోటి ద్వారా మైకేల్ జాక్సన్ పాటలకు సంగీతాన్ని సమకూర్చే ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు. ఎంజే సూపర్ హిట్ సాంగ్స్‌కు నోటితో సంగీతాన్ని ఇస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సుమారు 15 పాటలకు రమేష్ ధ్వని అనుకరణతో మ్యూజిక్ హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఖాన్ ప్రసంగిస్తూ మైకేల్ జాక్సన్ పాటలకు నోటి ద్వారా సంగీతం సమకూర్చడం అద్భుత ప్రక్రియ అన్నారు. రమేష్ ప్రతిభ నలుదిశలా తెలియాలని ఆకాంక్షించారు. డీటీఎస్ రమేష్ మాట్లాడుతూ నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు. కార్యక్రమంలో విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, బాదంగీర్ సాయి, రిటైర్డ్ పోలీస్ అధికారి మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయింది.. రిలీవ్ చేయండి

- ఏఎన్ఎంల డిమాండ్

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న తమను రిలీవ్ చేసి.. పనిచేసే ప్రాంతాలకు తిరిగి పంపాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. రేసవానిపాలెం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఎన్ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్ఎంలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. రెండేళ్ల కాలంలో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంగా విభజించి పరీక్షలు పూర్తి చేసి సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇంకా తమను ఇక్కడ కొనసాగించడం అన్యాయమన్నారు. మార్చి నుంచి శిక్షణ పేరిట నెలనెలా పొడిగిస్తున్నారని.. ఇంకా పొడిగిస్తారో, రిలీవ్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేయలేక, ఉద్యోగం వదులు కోలేక, కుటుంబ సభ్యులకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని చెప్పారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రిలీవ్ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీకి సమర్పించారు.



వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

క్రైం పీఎస్‌పై గోనె సంచుల ఏర్పాటు



క్రైం స్టేషన్‌పై పోలీసులు ఏర్పాటు చేసిన గోనె సంచులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ లోపలికి వర్షపు నీరు రావడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో క్రైం పీఎస్‌లోకి నీరు చేరి కేసులకు సంబంధించిన పలు పత్రాలు తడిచిపోయాయి. ఎస్ఐతో పాటు సిబ్బంది వాన నీరు కారకుండా స్టేషన్‌పై కప్పుపై తాత్కాలికంగా గోనె సంచులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్టేషన్ రేకుల షెడ్ కావడంతో ఒకవైపు నీరు లోపలికి రావడంతో కింద ఉన్న ప్లైవుడ్ తడిచిపోయేది. అధికారులు ఈ సమస్యను పరిశీలించాలని వారుకోరుతున్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు నగదు అందిస్తున్న దాతలు

మద్దిలపాలెం : శ్రీషిర్డీసాయినాథ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. కొత్త వెంకోజీపాలేనికి చెందిన కూలి పని చేసే కాళ్ల మహేష్ పిల్లలు హేమలత (8వ తరగతి), దివ్య (7వ తరగతి)ల ఉన్నత చదువులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు పి.రవితేజ, కాళ్ల అనిల్‌కుమార్ రూ.20 వేలు అందజేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల చదువుకు అండగా ఉంటామని సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మద్దాల నరసింహారావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఆడారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన మోటారు చట్టం రద్దు చేయాలి

ఆటో డ్రైవర్ల డిమాండ్



నిరసన చేపడుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: రోడ్డు రవాణా రంగంపై ఆర్థిక భారాలు వేసే జీవోలు వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 3న విశాఖలో జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ అక్కయ్యపాలెం హైవే వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన 2023 నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వందరోజుల్లో నిత్యావసర సరకులు, ఇంధన ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. నూతన మోటారు చట్టం రవాణా రంగాన్ని దివాలా తీస్తుందని, ఇప్పటికైన కేంద్రం కళ్లు తెరిచి ప్రమాదకర చట్టాలను రద్దు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, ఎం.నాగరాజు, జి.కనకరాజు, కె. అప్పలరాజు, ఎస్. కామేశ్వరరావు పాల్గొన్నారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : అకాల మరణం చెందిన హోంగార్డ్ మహ్మద్ హసమ్ కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. నగర పోలీస్ శాఖలో హసమ్ గత 19 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. న్యూరో సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మరణించారు. అతని కుటుంబానికి హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.10 వేలు మంజూరు చేశారు. హోంగార్డ్ భార్య జరీనా కౌశర్‌కు శుక్రవారం రూ.20 వేల చెక్కును అందజేశారు.